శ్యాం బెనెగల్ ప్రముఖ చిత్రానికి నవలా మాతృక

# సూర్యుడి ఏడో గుర్రం



ధర్మవీర్ భారతి

# సూర్యుడి ఏడో గుర్రం


## ధర్మవీర్ భారతి

రచించిన ప్రశస్త హిందీ నవల

తెలుగు అనువాదం :

## వేమూరి ఆంజనేయశర్మ



హైదరాబాద్ బుక్ ట్రస్టు

ధర : రూ. 50/-

మొదటి ముద్రణ : Southern Languages Book Trust, Chennai, 1967

HBT ముద్రణ : నవంబర్ 2009

ప్రతులకు, వివరాలకు: హైదరాబాద్ బుక్ ట్రస్ట్,
ప్లాట్ నెం. 85, బాలాజీ నగర్,
గుడిమల్కాపూర్,
హైదరాబాద్ - 500 067
ఫోన్ : 23521849
www.hyderabadbooktrust.blogspot.com

ముద్రణ : అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ, 126 శాంతినగర్,
హైదరాబాద్-28 ఫోన్: 23391364, 23304194



**ధర్మవీర్ భారతి** (1926-1997) హిందీ సాహితీరంగంపై బలమైన ముద్రవేసిన విశిష్ట రచయిత. కవిగా, నాటక రచయితగా, నవలాకారుడిగా, విమర్శకుడిగా హిందీ సాహిత్యంలో ఆధునిక పోకడలను ప్రవేశపెట్టిన ఘనత ఆయనది.

భారతి నవల 'గునాహోంకా దేవత' భారతీయ సాహిత్యంలో ఎన్నటికీ నిలిచిపోయే క్లాసిక్. మహాభారత యుద్ధం పరిసమాప్తమైన ఆఖరి రోజు పరిణామాలను సమకాలీన దృక్పథం నుంచి విశ్లేషిస్తూ రాసిన నాటకం 'అంధయుగ్' భిన్నతరాలకు చెందిన ప్రయోక్తల సారధ్యంలో దేశవ్యాప్తంగా ఇప్పటికి కొన్ని వేలసార్లు ప్రదర్శితమైంది. శైలీపరంగా ఓ అసాధారణ ప్రయోగం ఈ సూరజ్‌కా సాత్వా ఘోడా.

అలహాబాద్ విశ్వవిద్యాలయం నుంచి హిందీ సాహిత్యంలో ఎం.ఏ పట్టా తీసుకున్న ధర్మవీర్ భారతి 50 లలో విస్తృతంగా రాశారు, హిందీ అధ్యాపకుడిగా పనిచేశారు. 1960 నుంచీ 1987 వరకూ ప్రముఖ హిందీ వారపత్రిక 'ధర్మయుగ్'కు ప్రధాన సంపాదకుడిగా వ్యవహరించారు. పద్మశ్రీతో సహా పలు అవార్డులు అందుకున్న ఆయన 1997లో గుండెపోటుతో మరణించారు.

# కథా క్రమము


| | | పేజి |
|---|---|---|
| | ముందుమాట | 1 |
| | నివేదనము | 6 |
| | భూమిక | 9 |
| | ఉపోద్ఘాతం | 17 |
| 1. | మొదటి రెండుజాములు | 23 |
| 2. | రెండో రెండుజాములు | 37 |
| 3. | మూడో రెండు జాములు | 51 |
| 4. | నాలుగో రెండు జాములు | 67 |
| 5. | ఐదో రెండు జాములు | 81 |
| 6. | ఆరో రెండు జాములు | 97 |
| 7. | ఏడో రెండు జాములు | 105 |
| | మలిమాట | 111 |

# ముందుమాట

1980ల చివర్లో అనుకుంటా... ఓ రోజు షమా జైదీ వచ్చి 'మీరు ధర్మవీర్ భారతి రాసిన సూరజ్ కా సాత్వా ఘోడా నవల చదివారా?' అని నన్నడిగారు. స్క్రిప్టులు రాయటంలో చిరకాలంగా నాకు సహకరిస్తున్న ఆమె.. ఆ సమయంలో ఈ నవల ప్రస్తావన తేవటానికి ఓ చిన్న నేపథ్యం ఉంది!

నిజానికి అప్పటికి కొద్ది సంవత్సరాల క్రితం భారతి రచనే అయిన 'ఆశ్రమ్' నవలికను సినిమాగా తీద్దామని నేను ప్రయత్నించా. ఆ నవలిక ఆధారంగా ధర్మవీర్ భారతి ఒక స్క్రిప్ట్ రాశారు, అది బానే వచ్చింది కూడా. సరళంగా, పొందికగా నడిచే ఆ కథనంలో హుందాతనం ఉంది. నాటకీయత అంతా కూడా అంతర్లీనంగానే ఒదిగిపోవటం, పైకి చాలా నిర్మలంగా సాగిపోతునట్టే ఉన్నా లోపల్లోపల మరిగిపోతుండటం దాని ప్రత్యేకత. అంతా బాగానే ఉందిగానీ అలాంటి కథలను సినిమాలుగా తీస్తే ప్రేక్షకాదరణ అంతగా ఉండకపోవచ్చు. కాబట్టి నిర్మాత దొరకటమూ కష్టమే. దాంతో నా ప్రయత్నాలు అంతగా ముందుకు సాగలేదు.

ఆ తర్వాత ధర్మవీర్ భారతి రాసిన కథ 'బంద్ గలీ కా ఆఖరీ మకాన్' నా దృష్టికి వచ్చింది. ఆ కథ సినిమాటిక్‌గా బానే ఉందిగానీ అది పూర్తిస్థాయి చలనచిత్రంగా నిలబడటం కష్టమనిపించింది. ఏదీ సరిగా కుదరకపోతుండటంతో ఆ సమయంలో నాలో ఏదో తెలియని చికాకు ఆరంభమైంది. అప్పటికి దాదాపు రెండున్నర దశాబ్దాలుగా నేను తీస్తున్న సినిమాలన్నింటిలోనూ కథనాన్ని నేరుగా చెప్పుకుంటూ పోయే శైలినే అనుసరిస్తూ వస్తున్నాను. ఈ దఫా అలా కాకుండా నా

శక్తి సామర్థ్యాలకు ఒక సవాల్‌లా నిలిచే విభిన్నమైన కథాకథన శైలిని ఆవిష్కరించాలని తపన పడుతున్నాను.

ఇదిగో, సరిగ్గా అప్పుడే 'సూరజ్ కా సాత్వా ఘోడా' నా కంటబడింది, షమా జైదీ ద్వారా! దాన్ని చదువుతూనే కొత్త ఉత్సాహం వచ్చింది. ఆ నవల సినిమా హక్కులు కొందామనుకుని వెంటనే ధర్మవీర్ భారతిని సంప్రదించానుగానీ.. అప్పటికే దాన్ని టీవీ సీరియల్‌గా తీస్తానన్న ఓ నిర్మాతకు హక్కులు అమ్మటమో లేక మాట ఇవ్వటమో జరిగిందని చెప్పారాయన. ప్రాణం ఉసూరుమనిపించింది. శైలీపరంగా సంక్లిష్టమైన కథాకథన సంవిధానంతో సాహితీ జగత్తులో ఓ మైలురాయిగా నిలిచిపోయే నవల ఇది. హిందీ సాహిత్య రంగంలో దీన్నొక విశిష్ట నవలగా నిలబెట్టిందే ఆ కథన శైలి! అది కాస్తా టీవీ సీరియల్ రూపంలోకి వెళ్లే సరికి ఖండ ఖండాలైపోతుందని బాధేసింది. 'సూరజ్ కా సాత్వా ఘోడా' నవలలో ఎన్నో కథలున్నాయి. అన్నీ ఒకదానితో ఒకటి పెనవేసుకుని, బిగువుగా అల్లుకుపోతూ చదువరులకు గాఢమైన, నిగూఢమైన అనుభూతిని కలగజేస్తాయి. అలాంటి దీన్ని విడి విడి భాగాలుగా ముక్కలు చేసి, టీవీ సీరియల్‌గా నడిపిస్తే.. పురి విప్పిన దారంలా... ఆ అల్లిక, బిగువు, పొందిక.. అన్నీ పేలవంగా తేలిపోతాయనిపించింది. చూస్తూ ఉండలేక, ఆ టీవీ ప్రొడ్యూసర్‌తో ఎలాగైనా తెగతెంపులు చేసుకోవాలని ధర్మవీర్ భారతిపై ఒత్తిడి తేవటం ఆరంభించాను. నిజానికది నా తత్వానికి సరిపడని పనే. ముందెన్నడూ ఇలా చేయలేదు, భవిష్యత్తులో చేస్తాననీ అనుకోను. కానీ అప్పటికీ, ఇప్పటికీ కూడా నా విశ్వాసం ఏమంటే - అసాధారణ ప్రాముఖ్యం గత ఈ నవలను ఏ ముక్కకా ముక్కగా విడగొట్టటం, ఇందులోని ఒక్కో కథనూ ఒక్కో ఎపిసోడ్‌గా మలిచి సీరియల్‌గా తియ్యటం సరికాదని! మొత్తానికి కొన్ని నెలలు పెనుగులాడి దాన్ని



ఎలాగైనా సాధించగలిగాను. ఓ పక్క ఇది నడుస్తూనే ఉంది, మరోవైపు నుంచి ధర్మవీర్ భారతి బహుళ ప్రాచుర్యం పొందిన తన ప్రముఖ నవల 'గునాహోఁకా దేవతా'ను సినిమాగా తియ్యమని నా మీద ఒత్తిడి తేవటం ఆరంభించారు. ఎలాగయితేనేం, చివరికి నేను 'సూరజ్ కా సాత్వా ఘోడా' నే సినిమాగా తీస్తానని చెప్పి ఆయనను ఒప్పించాల్సి వచ్చింది. ఎందుకంటే నా దృష్టిలో ఒక అసాధారణమైన రచనగా నిలబడిపోయే ప్రత్యేకతలెన్నో ఈ నవలకు ఉన్నాయి.

ఈ నవల వెలువడిన నాటికి... ఇదో 'అపూర్వ' రచన. హిందీ కాల్పనిక సాహిత్యంలో ఇటువంటి శైలీ విన్యాసం అంతకు ముందెన్నడూ లేదు. కనీసం దీనికి దగ్గరగా ఉండే రచన కూడా మరోటి లేదు. అప్పటికిది సమకాలీనమే కాదు, ఆధునికతకు సంబంధించిన ఛాయలు, ఆ సున్నితత్వాలను కూడా దండిగా ప్రతిఫలిస్తుంది. కథ మన దేశంలోని చిన్నచిన్న పట్టణాల్లో దిగువ మధ్యతరగతికి చెందిన చదువుకున్న, పట్టణ యువత చుట్టూ తిరుగుతుంటుంది. వీళ్లంతా ఎంతోకొంత తమవైన ఛాందస సంప్రదాయాలనే కాదు, పాశ్చాత్య ఆలోచనా ధోరణులను కూడా ఎరిగిన వాళ్లు. ఒకరకంగా చెప్పాలంటే స్వాతంత్ర్యానంతరం ఎదిగొచ్చిన తొలి యువతరం ప్రతినిధులు వీళ్లు! ఇక కథనం చెప్పే తీరు.. పైకి చాలా సాదాసీదాగానే కనిపిస్తుంటుందిగానీ వాస్తవానికి స్థల, కాలాదుల విషయానికి వచ్చేసరికి ఇది అత్యంత సంక్లిష్టతతో సాగుతుంది. నవలలో ప్రధానంగా రెండు పాత్రలు కథ చెబుతుంటాయి. స్థూల కథ చెప్పేది ఒకరైతే ప్రధాన కథకుడు దొంతర దొంతరగా వచ్చే ఎన్నో అంతర కథలను చెబుతుంటాడు. ప్రేమను నిర్వచించే ప్రయత్నాల్లా కనిపించే ఈ కథలన్నీ కూడా పొరలు పొరలుగా విస్తరించుకుంటూ.. భూత-వర్తమానాల మధ్య తిరుగాడుతూ.. స్థల-కాల భావనలతో సయ్యాటలాడుతుంటాయి. మధ్యమధ్యలో మన భారతీయ సాహిత్యంలో 'ప్రేమ' అన్న భావన

ఎన్నెన్ని రూపాలెత్తిందో, అవతారాలు మార్చిందో సందర్భోచితంగా వచ్చే ప్రస్తావనల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ముఖ్యంగా 20వ శతాబ్ది సాహిత్యంలో రవీంద్రనాథ్ టాగోర్, శరత్‌చంద్ర చటర్జీ వంటివారు 'ప్రేమ'ను అభివ్యక్తీకరించిన తీరు చర్చకొస్తుంది. శరత్ సృజించిన దేవదాస్ నవల ప్రేమకు సంబంధించి ఎంతోకాలం ఓ మేరుస్తంభంలా నిలిచిపోయింది. భగ్నప్రేమికుడిగా ఆయన ఆవిష్కరించిన దేవదాసు పాత్ర.. భారతీయ సాహిత్యంలోనే కాదు, ఆది నుంచీ భారతీయ సినిమాల్లో కూడా ప్రేమకు ఓ 'సిసలైన' ప్రతిరూపంగా రాజ్యమేలింది. అమితాబ్ బచ్చన్ రంగం మీదికొచ్చి, సరికొత్తగా ఓ 'యాంగ్రీ యంగ్‌మ్యాన్' ప్రతిరూపాన్ని సెల్యులాయిడ్ మీద ప్రతిష్ఠించేంత వరకూ కూడా ఆ ధోరణే కొనసాగింది. అమితాబ్ ఆగమనం తర్వాతే భారతీయ సినిమాల్లో రొమాంటిక్ ప్రేమకున్న స్థానం, ప్రాధాన్యం మారింది.

'సూరజ్ కా సాత్వా ఘోడా' నవలలో ప్రధాన కథకుడు- ప్రేమ విషయంలో అటు ప్రాచీన సాహిత్యంలోనూ, ఇటు సమకాలీన సాహిత్యంలోనూ కూడా పాతుకు పోయిన లేదా రాజ్యమేలుతున్న భావనలను బద్దలుకొట్టటమే కాదు... వాటిలోని డొల్లతనాన్ని బయటపెట్టే వివేచనపరుడిగా కనబడతాడు. ఇందుకోసం అవసరమైన చోటల్లా తన స్వీయ ప్రేమానుభవాలను ఉదాహరిస్తుంటాడు.

ప్రధాన కథకుడైన మాణిక్ ముల్లా కొత్తగా రైల్వే మెయిల్ సర్వీసులో చేరిన యువకుడు. స్నేహితులందరికీ అతని ఇల్లే ఓ 'అడ్డా'. ప్రతి సాయంత్రం అంతా అక్కడ చేరి, తమకు ఆసక్తికరమైన అంశాలెన్నింటినో చర్చిస్తుంటారు. వీటిలో మాణిక్ ముల్లాకు ప్రేమ గురించి మాట్లాడటమన్నా, చర్చించటమన్నా మహా పిచ్చి, మహా ఇష్టం. అతను చెప్పే కథలు ప్రేమకు సంబంధించి పాఠకులకు మొత్తమ్మీద మూడు భిన్నమైన అనుభవాలను పరిచయం చేస్తాయి. ఒకటి కౌమారంలో ఉన్న అబ్బాయి ప్రేమ కథ. రెండోది నవయువకుడిది. మూడవ కథ పెద్దాయనది. ఇవన్నీ ప్రథమ పురుషలో చెప్పిన కథలే, అన్నీ మాణిక్ ముల్లా ప్రేమానుభవాలే. చిత్రమైన విషయమేమంటే ఈ ఘటనలన్నీ ఒక దానితో ఒకటి అల్లుకుపోయి, అన్నీ ఒకే సమయంలో, సమాంతరంగా జరుగుతున్నట్టే అన్పిస్తాయి. ఉన్నట్టుండి పాఠకుడికి అప్పుడు స్ఫురణకొస్తుంది, వయస్సును కేవలం సంవత్సరాల లెక్కల్లోనే కొలవాల్సిన అవసరం లేదనీ, దానికి 'మనస్తత్వం' కూడా ఒక కొలమానం కావొచ్చనీ! మన అనుభవాలు తరచూ కాలంలో ఘనీభవించి ఉంటాయని, ఆ కాల స్పృహ కూడా చాలా వరకూ వాస్తవికమైన స్థల-కాల రుజు గమనానికి అతీతంగా... మన ఇచ్ఛానుసారం ఎన్ని వంకర్లైనా తిరిగిపోతుంటుందని పాఠకులకు అవగతమవుతుంది. ఇంతటి సంక్లిష్టతను రచయిత ధర్మవీర్ భారతి నవలలో ఎంతో అలవోకగా, సముచితంగా, సమయోచితంగా సాధించారు. దీన్నంటినీ ఒడుపుగా సినిమా మాధ్యమంలోకి తేవటంలో భావ సంకేత ప్రధానమైన సవాళ్లెన్నో ఎదురయ్యాయి. నవలను సినిమాగా మలచటంలో నాకు ఎదురైన అత్యంత క్లిష్టమైన, ఇష్టమైన సవాల్ ఇది!



ఇక నవల గురించి చెప్పుకోవాలంటే.. నాటి సమకాలీన భారతీయ సాహిత్యంలో అత్యంత ఆధునికతను సిద్ధించుకున్న 'మోడర్నిస్ట్' నవలగా దీన్ని నిస్సందేహంగా పేర్కొనవచ్చు. అనువాద రూపంలో 'సూర్యుడి ఏడో గుర్రాన్ని' నేటితరం తెలుగు పాఠకుల ముందుకు తెస్తుండటం ముదావహం. ధర్మవీర్ భారతి గురించి వినని, భారతీయ సాహిత్యంపై ఆయన వేసిన ముద్ర ఏమిటో అంతగా తెలియని కొత్త తరానికి ఇదో అమూల్యమైన కానుక అని భావిస్తున్నాను.

**శ్యాం బెనెగల్**

జూలై 4, 2009

(తెలుగు : అనంత్)

# నివేదనము

'గునాహోఁకా దేవతా' (పాపాలదేవత) తరువాత ఇది నా రెండవ కథా రచన. రెండు రచనలలో కాలక్రమ విభేదమేకాకుండ ఏ పరిస్థితులలో నిలిచి నేను ఆయా సమస్యలను విశ్లేషించానో ఆ స్థితులలో కూడ ఇప్పుడు భేదము ఏర్పడ్డది.

ఈకథా శైలి కొంచెము కొత్తదే. కాని యథార్థంగా ఇది పాత శైలే, ఎంత పాతది అంటే ఇప్పటి పాఠకులకు కొంచెము కొత్తదిగా, అపరిచితంగా కనబడేటంత పాతది. చాలా చిన్న చట్రంలో పెద్ద పెద్ద సంఘటనలను, విస్తృత విషయాలను చిత్రించవలసిన ఆవశ్యకత కలిగినందువల్లనే ఈశైలి గ్రహింపబడింది.

నా దృక్పథము ఈ కథలలో విస్పష్టము. కాని వీటిలో కనబడే సామ్యవాద చర్చలవల్ల ఎవరైనా కొన్ని వివాదాలను లేవదీయవచ్చు. ఎవరు సత్యాన్ని కప్పిపుచ్చి, తమ వాదము సరిఅయినా కాకపోయినా, దాన్ని ప్రచారము చేయడమే తమ కర్తవ్యం అనుకొంటారో అటువంటి వారికి నేను చెప్పవలసింది ఏమి లేదు. ఎందుకంటే, అటువంటివారి రచనలకు ఉదాత్త సాహిత్యంలో విలువ ఉంటుందని నేను విశ్వసింపను. కాని విషయపరిజ్ఞానము, సహానుభూతి, పరిహాసప్రవృత్తి ఎవరిలో ఉంటాయో వారికి నేను కొంచెము వివరింపవలసి ఉంది.

గడచిన మూడు నాలుగు సంవత్సరాలలో సామ్యవాదాన్ని గురించి చదివినందువల్ల నాకు ఎంత శాంతి, బలము, జీవితాశ కలిగాయో, సామ్యవాదం మీద హిందీలో ఉండే సమీక్షలను చదవడం, వాటిని గూర్చి ఆలోచించడం వల్ల అంత నిరాశ, విచారము కలిగాయి. వీటిని వ్రాసినవారికి తమ సంఘము,



సంస్కృతి, పరంపరాగత మర్యాదలు వీటితో ఏమాత్రము పరిచయంలేదు. అందువల్ల వారి నిర్ణయాలను చూచి దుఃఖపడాలో, నిండు మనస్సుతో నవ్వాలో తెలియడము లేదు. అంతేకాక, వారి లోపాలను చూపించినప్పుడు, వారెక్కువగ కోపపడడము హాస్యాస్పదంగాను, శోచనీయంగాను ఉంటుంది.

అయినప్పటికి సామ్యవాదం మీద నా ఆసక్తి ఎప్పుడూ కొరవడదు. నేను నా ప్రజలకష్టాలు, దుఃఖాలుచూస్తూ ముఖం తిప్పుకొని ఉండలేదు. మెల్లమెల్లగ నాదృక్పథంలో సంఘానురక్తిని ఎక్కువగ వికసింపజేసుకోవడానికి తప్పక ఉన్ముఖుణ్ణిగా ఉన్నాను, ఉంటానుకూడ. సామ్యవాదం వెనుక కూడ అసంతుష్ట అహంభావం, ముఠాతత్త్వము కనబడ్డప్పుడు, అదేదృష్టితో సాహసించి వాటిని వేలెత్తి చూపడం అవసరమేనని అనుకొంటాను. ఎందుకంటే మనజీవితాలను సంస్కృతిని ఇవి సహజమార్గంలో అభివృద్ధి చెందనీయవు. సామాజిక, సామ్యవాదాల మొదటి షరతు 'ఆబ్జెక్టివిటి'. అది ఏ సామ్యవాదులలో వికసితమై ఉందో వారు నేను చెప్పేవిషయాన్ని అర్థంచేసుకొంటారు. అదిచాలు నేను సంతోషించటానికి. దీనికి భూమికను వ్రాయడానికి శ్రీ అజ్ఞేయగారు అంగీకరించారు. అందుకు వారి కెంత కృతజ్ఞుడినో నేను చెప్పలేను. నా మనస్సులో ఉండే ఆసక్తిని, గాఢ విశ్వాసాన్ని వారు గుర్తించగలరు. ఈ యుగంలో ఏ రచయితకైనా ఇంతకంటే కావలసిందేమున్నది? ఈ రచనలో శైలీ, ఇతివృత్త రహస్యాలను గూర్చి వ్రాయడానికి వారే సమర్థులు. నన్ను గూర్చి వారు వ్రాసిన ప్రశంసలకు నేను అర్హుడినో కాదో నాకు తెలియదు కాని ఆ ప్రశంసలకు నేను యోగ్యుణ్ణి కావలెనని కోరుకొంటూ, వారి ప్రేమ పూర్వకాశీర్వాదాలను తలఒగ్గి గ్రహిస్తాను.

నా పాఠకుల దగ్గరనుంచి నాకు ఎక్కువ ప్రేమను తెలిపే చాల విచిత్రమైన జాబులు వస్తూఉండేవి. అవినాకు అమూల్యనిధులు. వారితో నేను ఒక విషయము చెప్పగోరుతాను. అది - 'నేను వ్రాసి వ్రాసి నేర్చుకొంటూపోతూ ఉన్నాను; నేర్చుకొని, నేర్చుకొని వ్రాస్తూపోతున్నాను' - అని. నేను ఏదివ్రాసినా దాంట్లో సాంఘిక దృష్టి తప్పక ఉంటుంది. అట్లావ్రాయడం నా ఆత్మ సుఖం కోసం కూడ. ఈ ఆత్మలో మీరు అందరు కూడ కలిసే ఉన్నారు. మీ అందరి సుఖదుఃఖాలు నావే! వాస్తవంగా మన అందరి మూలాన వ్యక్తమవుతూ ఉండేది ఏదో ఒక పెద్ద కథే. దానిలో ఏ ఒక్క అంశాన్నో మాత్రమే నేను వ్రాశాను. కనుక ఈ రచనలో శ్రేయస్కరాంశము మీ అందరిది, లోపాలేవైనా ఉంటే నావి.

శివరాత్రి
23. ఫిబ్రవరి 1952 **ధర్మవీర్ భారతి.**



# భూమిక

రచయిత రెండు విషయాల నుంచి తప్పించుకోవాలి. ఒకటి భూమికలు వ్రాయడము, రెండు సమకాలిక రచయితలను గూర్చి తన అభిప్రాయాలు తెలపడము. ఇప్పుడు నేను ఈ రెండు తప్పులూ చేయబోతున్నాను. కాని ఈ పనిలో నాకు కొంచెము కూడ సంకోచములేదు. ఇంక చింతపడడమెందుకు? ధర్మవీర్ భారతిగారు ఉదీయమానులైన ప్రతిభానంపన్నులలో ఒకరని నేను విశ్వసిస్తున్నాను. ఇటువంటివారి మీదనే హిందీ సాహిత్య భవిష్యత్తు ఆధారపడి ఉంది. అంతంలేని అంధకారములో నుంచి హిందీ సాహిత్యం బయటపడ్డదని వీరిని చూచి మనము చెప్పవచ్చు.

ప్రతిభావంతులు ఇతరులు కూడ ఉన్నారు. మరి ఇతరుల ఉత్తమ రచనలుకూడ ఉన్నాయి. కాని ధర్మవీర్ గారిలో ఒక విశేషమున్నది. ఆయన పరిశ్రమశీలి అయిన ఉత్తమ రచయితే కాక, అందరికంటే ఎక్కువ స్వతంత్ర రచయితకూడ. నా దృష్టిలో ఇది చాల గొప్పవిశేషము, ఈ విషయాన్ని స్థిరపరచడానికే ఆ రెండుతప్పులూ చేయడానికి నేను ఇప్పుడు సిద్ధపడ్డాను. వీటిలో మొదటిదానినుంచి ఎప్పుడూ తప్పించుకొని వస్తూ వచ్చాను. కాని, రెండవదానినుంచి తప్పించుకోడానికి ప్రయత్నించలేదు. ఎందుకంటే, నా సమకాలికుల అలవాట్లకు విరుద్ధంగా, వారి రచనలు నేను చదువుతాను. చదివినప్పుడు వారిని గురించి తెలపడము తెలివిగలపని కాకపోయినా అస్వాభావికము కాదుగద!

భారతి 'జీనియస్' కారు : ఎవరినైనా 'జీనియస్' అని చెప్పడం వారి ప్రతిభకొక పెద్ద విశేషణాన్ని తగిలించి దానిని ఎగరగొట్టేయడమే.

'జీనియస్' అంటే ఏమిటి? అదేమో మనకు తెలియదు. లక్షణాలు మాత్రమే మనకు తెలుసు : శ్రమ ఎరుగని నిరంతర పరిశ్రమ, బహుముఖక్రియాశీలత, ప్రాచుర్యం, నిత్యజాగృతమైన నిర్మాణాత్మకకల్పన, నిశితపరిశీలనాశక్తి, సంతతజిజ్ఞాస, దేశ కాలయుగ సత్యాల చిత్రణలో జాగరూకత, పరంపరాగతవిజ్ఞానము, స్వతంత్రకార్యకుశలత, ఆత్మవిశ్వాసము, ఎక్కువ వినయము, భారతిగారిలో ఇవన్నీ ఉన్నాయి. కాని, వీటి నిష్పత్తి 'జీనియస్'లో కూడ సమానంగా ఉండదు. ఇదికాక భారతిగారిలో ఇంకొక విశేషం కూడా వున్నది. సాధారణంగా అది ప్రతిభతో కలిసి ఉండదు-అదే హాస్యము.

నేను చదివినట్లే, భారతిగారి ఇతర రచనలుకూడా చదివినవారికే నేను చెప్పేవిషయాలు అర్థమౌతాయి. ఎవరు వాటిని చదువలేదో వారు, సాధారణంగా ఇట్లా చెప్పినందువల్ల లాభమేమిటి, ప్రస్తుత విషయానికి సంబంధము లేనప్పుడు అని అనుకోవచ్చు. వారు ఆ విధంగా భావించడముకూడ సరిగానే ఉండవచ్చు. స్థాలీపులాకన్యాయము ఉపయోగపడేటట్లయితే అది స్వతంత్రప్రతిభాన్వితుడైన రచయితను పరీక్షించడానికి కూడ ఉపయోగపడుతుంది. ఎందుకంటే అటువంటివాడి ప్రతిభాముద్ర ఎంత చిన్నరచనలోనైనా కనబడుతూనే ఉంటుంది. "సూర్యుడి ఏడో గుర్రం" లో కూడ ధర్మవీర్ గారి విశిష్ట ప్రతిభాముద్ర విస్పష్టంగానే ఉంది.

అన్నిటికంటే మొదటి విషయము దాని రచనాక్రమము. ఇది మీరు బాల్యంనుంచి ఎరిగి ఉన్న అతి సరళమైన పాత పద్ధతి - చాల పాతపద్ధతి - అలఫ్ లైలా పద్ధతి, పంచతంత్ర, బొకేషియో పద్ధతి, ఆ పద్ధతిలో ప్రతిదినము కుతూహలంతో కథలు వినడానికి శ్రోతలసభ కూడుతుంది. ఒక కథలో నుంచి ఇంకొక కథ, దానిలో



నుంచి మరొక కథ; ఈ విధంగా ఎన్నోకథలు వస్తూ ఉంటాయి. కావలసినంత తీరికతో సంతోషంతో, నెమ్మదిగా పనులు జరిగిపోయే పూర్వకాలపు పద్ధతి అది. అప్పుడు కథలు కూడా తీరికగా ఉత్సాహంతో చెప్పబడేవి. అయితే భారతిగారికి కూడ అటువంటి కథలను ఆ విధంగా చెప్పడమే ఇష్టమా? కాదు. వీరి శైలికి ఈ సరళత, ప్రాచీనత భారతిగారి సాహిత్యాన్ని గూర్చి పాఠకులకు విశాల దృక్పథము ఏర్పడడానికి, హృదయానికి హత్తుకొని, బుద్ధిని ఉద్రూత లూగించివేయడానికే కాని, పొద్దు పోవడానికి, వినోద కాలక్షేపానికి కాదు. అపూర్వ రచనా ప్రతిభ శృంఖలారహితమైన కొత్తరచనలలో మాత్రమే కాదు ఉండేది. పాత పద్ధతులలో కొత్తదనము చూపడములో కూడ ఉన్నది (అంతే కాదు పాతవిషయముతో కొత్త రచన చేయడంలో కూడ ప్రతిభ లేకపోలేదు.) మరి భారతిగారు పైకి పాతదిగా కనబడే రచనా పద్ధతిని గూడ కొత్తదానివలె హిందీలో ఉపయోగించారు. ఈ విధంగా వారు చేయడం కేవలము ప్రయోగ కౌతుకంతో కాదు. వారి రచనకిది ఎక్కువ ఉపయోగకరంగా ఉంటుందనే.

సూర్యుడి ఏడోగుర్రంలో ఒక కథలో అనేక కథలే కాకుండా అనేక కథలలో ఏకకథ కూడా ఉన్నది. ఇది ఒక సంఘము యొక్క సమగ్ర చిత్రణము, సమాలోచనము కూడ. ఆ సంఘపు విభిన్నశక్తులు ఏ విధంగా పరస్పరాశ్రితాలో, పరస్పర సంబద్ధాలో, పరస్పర సంభూతాలో అదేవిధంగా ఆ కథలు కూడ ప్రాచీన చిత్రాలలో ఒకే చిత్రఫలకంమీద పరస్పర సంబంధంకల వివిధ సంఘటనలను చిత్రించి, ఆ విషయాన్ని వివరించేవారు. అందువల్ల కేవలము ఒక సంఘటనకు స్థిరరూపమిచ్చి చిత్రించకుండ వివిధ సంఘటనల నన్నిటిని ప్రవాహరూపంగా సంపూర్ణంగా చిత్రించి విషయాన్ని ఆకర్షణీయంగా విశదంగా తెలిపేవారు. అదేవిధంగా ఈ సాంఘిక

చిత్రణలో కూడా ఒకే విషయాన్ని అనేక దశలలో చాలమంది ద్వారా అనేక సమయాలలో చూచి విషయాన్ని సంపూర్ణంగా గ్రహించడానికి అవకాశము కల్పింపబడ్డది. అందువల్ల ఆ సంఘంలో దేశ కాలాల వల్ల కలిగే మార్పులు కూడ స్పష్టమౌతాయి. పొడుగు వెడల్పుగల చిత్రఫలకంలో లోతును నల్లరంగు ద్వారా తెలుపుతారు. సాంఘిక చిత్రణంలో దేశానికి చెందిన మూడు కొలతలే (dimensions) కాక, కాలానికి చెందిన కొలతను చిత్రించడము కూడ అవసరమే అవుతుంది. వీటిని చిత్రించడానికి చిత్రకారుడు ఇతర ఉపాయాలు వెతుక్కోవలసి ఉంటుంది.

ఈ రచనా చిత్రం సుందరంగా, ప్రీతికరంగా, సుఖప్రదంగాలేదు. ఎందువల్ల అంటే ఆ నిమ్న మధ్య వర్గపు జీవితం ఆ విధంగా లేదు. అంతేకాదు భారతిగారు సాధ్యమైనంతవరకు వాస్తవికంగా చిత్రించడానికి ప్రయత్నించారు. కాని అది అంత వికారంగా అప్రీతికరంగాలేదు ఏమంటే, ఆ సంఘము నశించలేదు; నశించగోరడము లేదు. ఈ అపద నుంచి తప్పించుకోడానికి రెండు సాధనాలున్నాయి. వీటిలో ఒక్కటైనాచాలు. ఒకటి హాస్యం. అది వక్రం కావచ్చు, లేదా అప్పుడప్పుడు కుటిలంకావచ్చు. రెండవది అదమ్యదృఢజీవితాశ. యథార్థంగా జీవితంలో ఉండే ఈ ఆసక్తే 'సూర్యుడి ఏడో గుర్రం'. అదే మనము భవిష్యత్తును గూర్చి కలలు కనేటట్టు చేస్తుంది. వర్తమాన కార్యకలాపాల విలువలు కట్టజేస్తుంది. వీటితో మనము నిర్మించే మార్గానే భవిష్యత్తు అనే గుర్రం వస్తుంది. ఈ ఇతివృత్తాన్ని, దీనిలో ఇమిడిఉన్న గంభీరభావాలను విశ్వసించి, సాహసించి గ్రహించడం, ఏమాత్రం జంకకుండ వాటిని ఇంత రమణీయంగా చిత్రించి, నిర్వహించడం - ఇవన్నీ 'సూర్యడి ఏడో గుర్రా'న్ని ఒక గొప్ప రచనగా నిలబెడుతున్నాయి.



"ఏమైనా, ఏదో ఒకానొక శక్తి, చీకటిని భేదించి ముందుకు సాగడానికి, సాంఘిక వ్యవస్థను మార్చడానికి, మానవత్వం విలువను పునఃస్థిరీకరించడానికి, మనకు బలాన్ని ఉత్సాహాన్ని చేకూరుస్తున్నది. దానిని మీరు ఆత్మ అనండి, లేదా మరేమైనా అనండి. ఏడుగుర్రాలు ఏవిధంగా సూర్యుడి రథాన్ని ముందుకు లాక్కొని పోతున్నాయో, అదే విధంగా విశ్వాసము, సాహసము, సత్యనిష్ఠ మొదలైనవి ఆ తేజోద్దీప్తమైన ఆత్మను ముందుకు తీసుకొని పోతున్నాయి'' ఈ మాటలు ఈ నవలలో కథానాయకుడు, ముఖ్యపాత్ర అయిన మాణిక్ ముల్లావి. ఏదో ఒక ఉక్తిని పట్టుకొని, ఆ పాత్రతో రచయిత సంపూర్ణంగా ఏకీభవిస్తున్నాడు అని చెప్పేటంత మూర్ఖత నాకులేదు. కాని ఆ పాత్ర చెప్పే ఈ విషయంలో భారతిగారికి కూడ విశ్వాసమున్నదని నాకు తోస్తుంది. ఈ విశ్వాసం మన అందరిలో కూడ దృఢంగా ఉండాలని నా కోరిక.

వసంత పూర్ణిమ
1952 **- అజ్ఞేయ.**

---

'అజ్ఞేయ' అన్న కలంపేరుతో లబ్ధప్రతిష్ఠులైన సచ్చిదానంద హీరానంద వాత్సాయన (1911-1987) ఆధునిక హిందీ సాహిత్యంలో నవ్య కవితకు, ప్రయోగవాదానికి ఆద్యులనవచ్చు. కవిగా సుప్రసిద్ధులైనా ఒక్క కవిత్వంలోనే కాదు, విమర్శ, కాల్పనిక సాహిత్యం, జర్నలిజం వంటి భిన్నరంగాల్లో కొత్త ఒరవడి సృష్టించారు. 'దిన్‌మన్' హిందీ వారపత్రిక సంస్థాపకులు.

# సూర్యుడి ఏడో గుర్రం

# ఉపోద్ఘాతం

ఈ చిన్న నవల చదవడానికి పూర్వం మాణిక్ ముల్లా ఎవరో, ఆయనను మేమెక్కడ కలిశామో, ఈ కథలు ఏ విధంగా బయటికి వచ్చాయో, ప్రేమ విషయంలో మాణిక్‌ముల్లా భావాలు ఏమిటో, కథానిక టెక్నిక్‌కు సంబంధించి ఆయనకున్న అభిప్రాయాలు ఎటువంటివో తెలుసుకొనడం మంచిది. ఈ చిన్న నవల పేరు "సూర్యుడి ఏడో గుర్రం." దీనిలో ప్రేమకథలు వర్ణించబడివున్నవి. అవి మాణిక్ మూల్లాకు సంబంధించినవి.

మాణిక్‌ముల్లాను గురించి భూతకాలక్రియలు ఎందుకు వాడుతున్నానంటే - ప్రస్తుతం, ఆయన ఎక్కడ నివసిస్తున్నాడో, ఏమి చేస్తున్నాడో, అసలాయనను ఈ జన్మలో కలుసుకొనడం సంభవమో, కాదో తెలియదు. ఆయనతో బాటు ఆయన కథలుగూడా అదృశ్యమైపోకుండా వుండడం అవసరమని ఈ ప్రయత్నం చేస్తున్నాను.

ఒకప్పుడు ఆయన మా పేటలో వున్నవారందరిలో చాలా ప్రసిద్ధుడు. అక్కడే పుట్టి, అక్కడే పెరిగి, పెద్దవాడై కీర్తిప్రతిష్ఠలు గడించి ఆయన అక్కడే అదృశ్యుడైనాడు. మా పేట చాలా పెద్దది. అది చాలా విభాగాలుగా విభజింపబడి వున్నది. మాణిక్ ముల్లా నివసించిన భాగం తరతరాలుగా రకరకాలైన వ్యక్తులు నివసించిన, – వదంతులు వ్యాపించిన – భాగం.

ముల్లా ఆయన ఉపనామం గాదు. అది ఆయన జాతి పేరు. ఆయన కాశ్మీరు దేశంవాడు. అయినా ఆయన కుటుంబం తరతరాలుగా ఆ పేటలోనే నివసిస్తున్నది. ఆయనకు అన్నా, వదినా ఉండేవారు. వారిద్దరూ బదిలీ అయి ఎక్కడికో వెళ్ళారట. అందువల్ల

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/kbook.php?id=739](http://kinige.com/kbook.php?id=739)**

* * *